ఎన్నికల సంబంధ విధుల్లో అధికార యంత్రాంగం తీరుతో జిల్లా ప్రతిష్ట మసకబారుతోంది. రాష్ట్రంలో అనేక జిల్లాలుండగా ఎక్కడా లేని విధంగా ఇక్కడి యంత్రాంగమే ఎన్నికల అధికారుల ఆగ్రహానికి గురవుతోంది. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో విఫలమయ్యారన్న ఫిర్యాదులతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఏకంగా అప్పటి కలెక్టర్, అర్బన్ ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, ఓ సీఐని బదిలీ చేయాల్సిందిగా ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇపుడు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా తయారీలో అవకతవకలు జరుగుతున్నాయనే ఫిర్యాదులతో కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా అధికారులపై మండిపడుతోంది. మొత్తం మీద రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాల హెచ్చరికలు, చర్యలతో గతంలో ఉమ్మడి జిల్లా, ప్రస్తుతం కొత్త జిల్లా తలవంపులకు లోనవుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



మచ్చ పడుతోంది సారూ!

- ఎన్నికల్లో అధికారుల తీరుతో మసకబారుతున్న జిల్లా ప్రతిష్ట
- గతంలో కలెక్టర్, ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, ఓ సీఐలపై బదిలీ వేటు
- ఇటీవల జిల్లా అధికారులపై ఎన్నికల కమిషన్ తీవ్ర ఆగ్రహం
- రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గి స్వతంత్రంగా వ్యవహరించలేని తీరుకు పర్యవసానం

ఓటర్ల జాబితా తయారీలో అక్రమాలపై సీఈసీ కన్నెర్ర

ఈ ఏడాది మార్చి లేదా ఏప్రిల్‌లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గతేడాది జూన్ నుంచీ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆ ప్రక్రియలో ప్రత్యేకించి చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి తదితర నియోజకవర్గాల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని గత జూన్ నుంచీనే ప్రతిపక్షాల నుంచీ పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. ఎప్పటికప్పుడు ముఖ్యంగా టీడీపీ గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు బీఎల్వోలు మొదలుకుని తహసిల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ దాకా ఫిర్యాదులు చేస్తూనే వున్నారు. అయితే వాటిపై అధికారులు సక్రమంగా విచారించి చర్యలు తీసుకోలేదు. చంద్రగిరిలో అయితే టీడీపీ ఓట్లు తొలగించాలని కోరుతూ ఆ పార్టీ వారి పేరిటే తప్పుడు క్లెయిమ్ ఫారాలు అందజేయడం వంటి అవకతవకలు చోటుచేసుకున్నాయి. భార్య, బిడ్డల ఓట్లు తొలగించాలని ఆ ఇంటి యజమాని పేరిటే దరఖాస్తు అందడం వంటి ఘటనలను టీడీపీ నేతలు వందల్లో గుర్తించారు. వలస వెళ్ళిన వారి పేర్లు తొలగించకపోవడం, మృతి చెందిన వారి పేర్లు తొలగించకపోవడం, ఇతర ప్రాంతాలకు చెందిన వారి పేర్లు జాబితాలో నమోదు చేయడం వంటివి జరిగినట్టు గుర్తించారు. వాటిని ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో టీడీపీ నాయకులు నేరుగా ఎన్నికల సంఘానికే ఫిర్యాదు చేశారు.

గత నెలలో విజయవాడలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు జిల్లాల వారీగా సమీక్షించినపుడు కూడా తిరుపతి జిల్లా అధికారులే ఎక్కువగా ప్రశ్నలను, హెచ్చరికలను ఎదుర్కొనాల్సి వచ్చింది. అభ్యంతరాలపై బీఎల్వోలు సక్రమంగా విచారణ జరపలేదని గుర్తించిన ఎన్నికల సంఘం అధికారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో తిరుపతి రూరల్ మండలంలోనే 24మంది బీఎల్వోలకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. జనవరిలో మళ్ళీ సమీక్షిస్తామని, అప్పటికి సమస్యలేవీ లేకుండా చర్యలు తీసుకోవాలని గత డిసెంబరు సమావేశాల్లోనే ఎన్నికల సంఘం జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దానికనుగుణంగా ఈనెల 9వ తేదీన విజయవాడలో జిల్లాల వారీగా కేంద్ర ఎన్నికల కమిషనర్లు సమీక్ష జరిపారు. మిగిలిన జిల్లాల సమీక్ష నామమాత్రంగా ఐదు పది నిమిషాల లోపే జరగగా తిరుపతి జిల్లాపై సమీక్ష గంటకు పైగా నడిచిందని సమాచారం. చాలా లోతైన సమాచారంతో సమీక్షించిన ఎన్నికల కమిషనర్లు జిల్లా అధికార యంత్రాంగం తీరుపట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా గత నవంబరులో విడుదల చేసిన డ్రాఫ్ట్ జాబితా పరిశీలించి వాటిపై ప్రతిపక్ష నాయకులు అభ్యంతరాలు తెలిపినప్పటికీ తొలగించాల్సిన పేర్లు ఇప్పటికీ జాబితాలో కొనసాగుతుండడం పట్ల ఎన్నికల కమిషనర్లు తీవ్రంగా స్పందించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఓటర్లు, రాజకీయ పక్షాల నుంచీ అందిన అభ్యంతరాలపై గడువులోపు పూర్తిస్థాయిలో విచారణ జరిపి అక్రమాలుంటే వాటిని సరిదిద్దాలని డెడ్‌లైన్ విధించింది.

ఎంపీ ఉప ఎన్నికల తప్పిదాలపైనా ప్రస్తావన

విజయవాడలో జిల్లా అధికారులతో ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం సమీక్షించిన సందర్భంలో 2021 మార్చిలో జరిగిన తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల తప్పిదాలను ప్రధానంగా ప్రస్తావించినట్టు తెలిసింది. అప్పటి తిరుపతి మున్సిపల్ అధికారుల కారణంగా అధికార పార్టీ నాయకులు ఏకంగా డూప్లికేట్ ఓటరు కార్డులను యధేచ్ఛగా తయారు చేసి దొంగ ఓట్లు వేయించారన్న విషయాన్ని ప్రస్తావించినట్టు సమాచారం. ఓ అధికారి తన లాగిన్ ఐడీని అధికార పార్టీలో ముఖ్యనేతకు అందజేయడంతో ఆ నేత పూర్తిస్థాయిలో దుర్వినియోగం చేసినట్టు గుర్తించామని ఎన్నికల సంఘం అధికారులు ప్రస్తావించినట్టు తెలిసింది. గత పార్లమెంటు ఉప ఎన్నికలకు సంబంధించి, అలాగే ఇపుడు ఓటర్ల జాబితా తయారీకి సంబంధించి జిల్లా యంత్రాంగం కేంద్ర ఎన్నికల సంఘం నుంచీ తీవ్ర ఆగ్రహాన్ని, అసంతృప్తిని ఎదుర్కొనాల్సి వచ్చింది.

గతంలో కలెక్టర్, ఎస్పీ సహా ఇతర అధికారులపై బదిలీ వేటు

ఉమ్మడి జిల్లాకు సంబంధించి 2020 మార్చిలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో బాధ్యతారహితంగా వ్యవహరించారన్న ఆరోపణలతో అప్పటి కలెక్టర్ నారాయణ భరత్ గుప్తా, తిరుపతి అర్బన్ ఎస్పీ ఆవుల రమేష్‌రెడ్డి, పలమనేరు డీఎస్పీ ఆరిఫుల్లా, శ్రీకాళహస్తి డీఎస్పీ నాగేంద్రుడు, పుంగనూరు సీఐ గంగిరెడ్డిలను విధుల నుంచీ తొలగించాల్సిందిగా స్టేట్ ఎలక్షన్ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే కొవిడ్ సంక్షోభం కారణంగా అప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వాయిదా పడింది. తర్వాత 2021 జనవరిలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభించేందుకు కసరత్తు మొదలుపెట్టగా ఎస్ఈసీ రమేష్‌కుమార్ మరోసారి ఈ అధికారులను బదిలీ చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. కానీ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో ఈ ఆదేశాలు అమలు కాలేదు. కానీ ఎస్ఈసీ ఆదేశాల ప్రభావం జిల్లా యంత్రాంగంపై తీవ్ర ప్రభావం చూపి జిల్లా అధికారి నుంచీ ఉద్యోగి వరకూ భయభ్రాంతులకు గురి చేసింది. దీనికి మించి జిల్లా పరువు ప్రతిష్ఠలు దారుణంగా దెబ్బ తిన్నాయి. ఇపుడు తిరుపతి జిల్లా యంత్రాంగం పని తీరు కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహానికి, అసంతృప్తికి, హెచ్చరికలకు కారణమై మరోసారి జిల్లా పరువు ప్రతిష్ఠలు మసకబారే పరిస్థితి నెలకొంది.



స్వర్ణముఖిలో గొబ్బెమ్మల నిమజ్జనం

స్వర్ణముఖి పులకింత



ఏటిపండుగలో జనసందోహం

నాయుడుపేట, జనవరి 17: స్వర్ణముఖి నది జన సంద్రమైంది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా యేడాది పండుగ రెండో రోజు బుధవారం ఏటి పండుగకు జనం భారీగా తరలివచ్చారు.గొబ్బెమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు నదిలో నిమజ్జనం చేశారు.టీవీ నటుల హాస్యవల్లరి కార్యక్రమం అలరించింది. రంగురంగుల బెలూన్లు, రంగులరాట్నాలు, జెయింట్‌వీల్, నెమలి పడవ, బెలూన్ జారుడుబల్ల తదితరాలు చిన్నారులను ఎంతగానో ఆకట్టుకొన్నాయి. గాలిపటాలను ఎగురవేస్తూ ,కబడ్డీ, రింగ్‌బాల్, ఖోఖో ఆటలతో యువకులు ఆనందించారు.



కొండచుట్టు మండపం వద్ద జనసందడి

వేడుకగా కొండచుట్టు

పుత్తూరు జనవరి 17: సంక్రాంతి సంబరాల్లో భాగంగా కొండచుట్టు మండప ఉత్సవం బుధవారం పుత్తూరులో వైభవంగా జరిగింది.పట్టణంలోని చిత్తూరు రోడ్డులో కొత్తగా నిర్మించిన కొండచుట్టు మండపానికి ఊరేగింపుగా చేరుకున్న ఎనిమిది ఆలయాల దేవుళ్లను ప్రజలతో పాటు మంత్రి రోజా దర్శించుకున్నారు.పదేళ్ల కిందట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించిన మండపం స్థానంలో పునర్నిర్మించిన కొత్త మండపంలో తొలిసారి ఎనిమిది దేవుళ్ల ఈసారి కొలువు కావడం విశేషం.ఈ ఉత్సవం వల్ల చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిలో ట్రాఫిక్ స్తంభించడంతో నెత్తం మీదుగా నగరి రోడ్డులోకి వాహనాలను మళ్లించారు. మున్సిపల్ ఛైర్మన్ హరి , వైస్‌ఛైర్మన్లు జయప్రకాష్, సదాశివేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.





ఎల్లమ్మ ఊరేగింపులో జనసందోహం

ఎల్లమ్మ కొండచుట్టు తిరుణాళ్ళు

చంద్రగిరి, జనవరి 17 : చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ సంక్రాంతి మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కొండచుట్టు తిరుణాళ్ళ వైభవంగా జరిగాయి. మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి ఉత్సవ మూర్తిని ఆలయ ముఖ మండపానికి తీసుకొచ్చి పట్టు పీతాంబరాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి అశ్వవాహనంపై అధిష్టింపజేశారు.చంద్రగిరిలోని మిట్టమీద గంగమ్మ, కోటలోని ముత్యాలమ్మ, చంద్రగిరి కొత్తపేటలోని అంకాలమ్మ, రాయలపురం గ్రామంలోని మాతమ్మ ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఎల్లమ్మతో పాటు మేళతాళాలు, కీలుగుర్రాలు, కోలాటాలు, చెక్కభజనలు, పిళ్ళంగట్లు నడుమ చంద్రగిరిలో ఊరేగించారు. టీటీడీ తరపున ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పట్టు వస్త్రాలను కోదండరామాలయం నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ తీసుకొచ్చి ఎల్లమ్మకు సమర్పించారు.ఎల్లమ్మ బుధవారం రాత్రి అగరాల, కుప్పిరెడ్డిగారిపల్లె, పుల్లయ్యగారిపల్లె, పాండురంగయ్యగారిపల్లె, ఐతేపల్లె, కొటాల, నాగయ్యగారిపల్లె, రెడ్డివారిపల్లెల మీదుగా ఊరేగి గురువారం తెల్లవారుజామున ఆలయానికి చేరుకుంది. ఆలయ చైర్మన్ చంద్రశేఖర రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



కారులో ఇరుక్కుపోయిన సీఐ అక్కేశ్వరరావు

కారు,బస్సు ఢీ

మార్టూరు సీఐకి తీవ్రగాయాలు

పెళ్లకూరు, జనవరి 17:బాపట్ల జిల్లా మార్టూరు సీఐ అక్కేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... అనంతపురం జిల్లా లేపాక్షిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్యక్రమ బందోబస్తుకు వెళ్లి తిరిగి వస్తున్న సీఐ అక్కేశ్వరరావు కారు, ఓ ప్రైవేట్ బస్సు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన పెళ్లకూరు మండలంలోని గుర్రప్పతోట 71వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఈ ప్రమాదంలో సీఐ అక్కేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా, కారు డ్రైవర్ సర్దార్‌కు స్వల్ప గాయాలయ్యాయి.కారు నుంచి మంటలు చెలరేగిన సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. సీఐ అక్కేశ్వరరావును, డ్రైవర్ సర్దార్‌ను అతి కష్టం మీద కారులో నుంచి బయటకు తీసి 108 వాహనంలో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఎదురెదురుగా ఢీకొన్న బస్సు, కారు

రా...కదలిరా

వెంకటగిరిలో రేపు టీడీపీ బహిరంగ సభ

ఏర్పాట్లను పరిశీలించిన పార్టీ నాయకులు



చంద్రబాబు సభ నిర్వహించే ప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వెంకటగిరి, జనవరి 17: వెంకటగిరి పట్టణంలోని తిరుపతి రోడ్డు మార్గంలో తెలుగు దేశం పార్టీ రా కదలిరా పేరిట 19వతేది నిర్వహిస్తున్న బహిరంగ సభ ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. సభా ప్రాంగణంలో స్టేజ్ ఏర్పాటు చేసే ప్రదేశంలో వేదపండితులచే భూమిపూజా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హాజరయ్యే ఈ సభ ఏర్పాట్లను బుధవారం తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు నరసింహయాదవ్, వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు పరిశీలించారు. ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి చంద్రబాబు రూట్ మ్యాప్‌ను నాయకులకు వివరించారు.టీడీపీ నాయకులు మస్తాన్‌యాదవ్, పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, జన్ని రమణయ్య, మధు నాయుడు, సీసీ నాయుడు, శాంతారావు, కాపా శ్రీనివాసుల నాయుడు, కొరపాటి రామచంద్రానాయుడు, సుధ తదితరులు పాల్గొన్నారు.

దొంగే దొంగా..దొంగా అని అరిచినట్లుంది

చంద్రబాబుపై వైసీపీ సర్కారు పెట్టిన కుట్రపూరిత కేసులు దొంగే దొంగా.. దొంగా అని అరిచిన చందంగా ఉందని నరసింహయాదవ్ ఆక్షేపించారు.రా కదలిరా బహిరంగ సభా ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కోర్టు తీర్పులను సైతం జగన్ పత్రికలో వక్రీకరించి రాయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.తెలుగుదేశం, జనసేన నాయకులు చిన్న ట్వీట్ పెడితేనే పెద్ద కేసులు కట్టే ప్రభుత్వం జగన్ పత్రిక తప్పుడు రాతలు రాస్తుంటే చూస్తూ ఊరుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రజలు జగన్మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని ఇందుకు చంద్రబాబు నిర్వహించే సభలకు అంచనాలకు మించి జనం హాజరు కావడమే నిదర్శనమన్నారు. కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబుపై ఎన్నితప్పుడు కేసులు పెట్టినా కడిగిన ముత్యంలా ఆయన బయటకు వస్తారన్నారు.

జల్లికట్టు వేడుకల్లో విషాదం

ఎద్దు పొడవడంతో తిరుపతివాసి మృతి

చంద్రగిరి, జనవరి 17: చంద్రగిరి మండలంలో బుధవారం నిర్వహించిన జల్లికట్టు వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది.మల్లయ్యపల్లె, దోర్నకంబాల, మండపంపల్లెల్లో నిర్వహించిన జల్లికట్టు సంబరాలతో మూడు గ్రామాలూ తిరుణాళ్ళను తలపించాయి. కోడెగిత్తలను నిలువరించి చెక్కపలకలను సొంతం చేసుకొనేందుకు యువత పోటీ పడ్డారు.ఈ ప్రయత్నంలో కొంతమంది గాయపడ్డారు.అనుప్పల్లి-చంద్రగిరి రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలు పెరిగిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. మల్లయ్యపల్లె సమీపంలోని ధనేశ్వరమ్మ ఆలయం వద్ద బుధవారం మధ్యాహ్నం తిరుపతికి చెందిన గురుప్రసాద్ రోడ్డు దాటుతుండగా ఓ ఎద్దు పొడవడంతో అపస్మారస్థితికి చేరుకున్నాడు. 108అంబులెన్సులో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు.



దోర్నకంబాల జల్లికట్టులో యువత ఉత్సాహం - ఎద్దు పొడవడంతో గాయపడ్డ గురుప్రసాద్

తుడా మాజీ చైర్మన్ ఎల్బీ ప్రభాకర్ కన్నుమూత



పాకాల, జనవరి 17: సీనియర్ రాజకీయ వేత్త, తుడా మాజీ చైర్మన్ ఎల్బీ ప్రభాకర్ నాయుడు అనారోగ్యంతో కన్నుమూశారు.వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 11.30గంటలకు ఆయన మృతి చెందారు.పాకాల పట్టణం కమతంపల్లెకు చెందిన ప్రభాకర్ యువకుడిగా వున్నప్పటి నుంచే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు.టీడీపీలో తొలినుంచీ పని చేసిన ఆయన 1994లో జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా చిత్తూరు జిల్లా పార్టీ కన్వీనరుగా పనిచేశారు.ఆ ఎన్నికల్లో చిత్తూరు మినహా జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు మంచి మెజారిటీతో గెలుపొందడం విశేషం.అనంతరం తుడా చైర్మన్‌గా పని చేశారు.తరువాతి కాలంలో కాంగ్రెస్‌లో చేరిన ఆయన ప్రస్తుతం వైసీపీలో కొనసాగుతున్నారు. ఈయనకు భార్య, కుమార్తె వున్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడికి నివాళి



భాస్కర నాయుడు (ఫైల్‌ఫొటో)

రామచంద్రాపురం, జనవరి 17: రావిళ్లవారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ భాస్కర నాయుడు మృతి చెందడంతో ఆయన మృతదేహానికి బుధవారం పలువురు నివాళులు అర్పించారు.టీడీపీ నాయకులు పులివర్తి వినీల్, చిన్నబాబు, జనార్దన చౌదరి, ఉమాపతినాయుడు, తిరుమలరెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి తదితరులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు - మృతి చెందిన గంగాధరం

చంద్రగిరి, జనవరి 17: చంద్రగిరి మండలం అగరాల సమీపంలో ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు ... నరసింగాపురానికి చెందిన గంగాధరం(45) చంద్రగిరిలో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై చంద్రగిరి నుంచి ఐతేపల్లెకు వెళుతుండగా వెనుక వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగాధరం తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృత దేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత



భక్తుడికి నగదును అప్పగిస్తున్న సెక్యూరిటీ

చంద్రగిరి,జనవరి17: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామి దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలు పర్సు పోగొట్టుకుంది. టీటీడీ సెక్యూరిటీ విభాగంలో పని చేసే చిరంజీవులుకు పర్సు దొరకడంతో అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. తమిళనాడు రాష్ట్రం, పుదిచ్చేరికి చెందిన పోచమ్మ తన పర్సు అని తెలపడంతో ఆమెకు అప్పగించారు. అందులో సుమారు ఆరు వేల రూపాయల నగదు, ఏటీఎం కార్డులు ఉన్నాయి.

శ్రీరామ్ కథా జ్ఞాన యాగంలో టీటీడీ చైర్మన్



చంద్రగిరి, జనవరి17: శ్రీవారిమెట్టు మార్గంలోని భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శ్రీరామ్ కథాజ్ఞాన యాగం మహోత్సవంలో టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి పాల్గొన్నారు. బుధవారం ఉదయం భక్తాంజనేస్వామిని దర్శించుకుని, పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొనగా నిర్వాహకులు ఆయనకు తలపాగా ధరింపజేసి, ఆహ్వానం పలికారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి



రాము మృతదేహం

చంద్రగిరి, జనవరి17: చంద్రగిరి మండలం పనపాకం వద్ద బుధవారం ఉదయం 9 గంటల సమయంలో బైక్‌ను వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... మండలంలోని ముంగిలిపట్టు ఎస్టీ కాలనీకి చెందిన బాబు కుమారుడు రాము(21), ప్రశాంత్‌లు పనపాకం నుంచి చిత్తూరు వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పనపాకం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో రాము, ప్రశాంత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. రాము చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రగిరి

తిరుచ్చిపై సుందరరాజస్వామి అభయం



తిరుచానూరు, జనవరి 17: తిరుచానూరులో కొలువై ఉన్న సుందరరాజస్వామి బుధవారం భూదేవి, శ్రీదేవి సమేతుడై తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్రను పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజాదికార్యక్రమాలు నిర్వహించారు.సాయంత్రం అలంకార శోభితుడైన స్వామివారి దేవేరులతో బంగారు తిరుచ్చిపై కొలువుదీరి మాడవీధుల్లో భక్తులను అనుగ్రహించారు.డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అత్తూరు డాబా ప్రారంభం



తిరుపతి రూరల్, జనవరి 17: తిరుపతిలోని ఎంఆర్ పల్లెలో అత్తూరు డాబాను బుధవారం సివిల్ సప్లైస్ మాజీ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా డాబా యజమాని ఈశ్వర్‌రెడ్డిఆయన్ను ఘనంగా సత్కరించారు.చెంచురెడ్డి, సుధాకర్, శివ, ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి హెల్తీ విలేజ్ జాతీయ సదస్సు

ముస్తాబైన మహిళా యూనివర్శిటీ ● వివిధ రాష్ట్రాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు రాక

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 17: కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో పద్మావతి విశ్వవిద్యాలయం వేదికగా గురువారం నుంచి మూడు రోజుల పాటు సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల స్థానికీకరణపై ఆరోగ్యకరమైన గ్రామం(హెల్తీ విలేజ్) జాతీయ సదస్సు జరగనుంది. కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి ఏర్పాట్లను పరిశీలించారు. వైద్యశాఖ, డీఆర్‌డీఏ, మెప్మా, టీటీడీ, మహిళా శిశు సంక్షేమ శాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మొదటిరోజు కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షిస్తారు. ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ మంత్రి (పంచాయతీరాజ్ శాఖ మంత్రి) కపిల్ మోరేశ్వర్ పాటిల్ పాల్గొంటారు. రాష్ట్రం నుంచి డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బుడి ముత్యాలనాయుడు, జిల్లా మంత్రులు హాజరవుతారు. వివిధ రాష్ట్రాల నుంచి 800మంది ప్రతినిధులు హాజరవుతారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో ముఖ్య అతిథి సందేశం తర్వాత వివిధ రాష్ట్రాల మధ్య చర్చలు జరుగుతాయి. శనివారం జిల్లాలోని ఆదర్శగ్రామాల్లో 250 మంది అతిథుల క్షేత్రస్థాయి సందర్శన ఉంటుంది.



సదస్సు ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్

ఎల్లమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ



చంద్రగిరి, జనవరి17: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయ సంక్రాంతి మహోత్సవాల్లో బుధవారం కొండచుట్టు ఉత్సవం సందర్భంగా పులివర్తి సుధారెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా ఇరవై ఏళ్లగా కొండచుట్టు ఉత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈక్రమంలో బుధవారం చంద్రగిరిలోని క్లాక్ టవర్ వద్ద గల వినాయకస్వామి ఆలయం నుంచి మూలస్థాన ఎల్లమ్మ ఆలయం వరకు పులివర్తి సుధారెడ్డి చేతులమీదుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. వీరికి ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి స్వాగతం పలికారు.టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, తెలుగు మహిళా కార్యదర్శి సింగు సుధా, నాయకులు బాలకృష్ణమూర్తి, లంకెళ్ళ లలిత, తులసేశ్వరరెడ్డి, రాజులగారి వినోద్, సక్కూరి ధనంజయరెడ్డి, కాపువీధి సునీల్, కేసీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో అంగన్వాడీల నిరసన



కళ్ళకు గంతలు కట్టుకుని మోకాళ్ళపై నిలబడి నిరసన

చంద్రగిరి, జనవరి 17: చంద్రగిరిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ముందు అంగన్వాడీ వర్కర్లు బుధవారం వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. కళ్ళకు నల్ల రిబ్బన్ కట్టుకుని మోకాళ్ళపై నిలబడి దండాలు పెడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం జగన్‌కి మంచి మనసు ప్రసాదించాలంటూ నినదించారు. భగ భగ మండే సూర్యుడిని చూడు....అంగన్వాడీ వర్కర్స్‌ను చూడు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ మాట్లాడుతూ అంగన్వాడీవర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. ప్రభుత్వం కాలయాపన చేస్తే వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికలలో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు లక్ష్మి, ప్రియదర్శి, లీలా, నాగరాజమ్మ, నాగభూషణమ్మ, విమల, హరిత, తదితరులు పాల్గొన్నారు.

తలనీలాల వేలం పాటల్లో తగ్గిన ఆదాయం

ఎర్రావారిపాలెం, జనవరి 17: తలకోన సిద్ధేశ్వర స్వామి దేవస్థానంలో తలనీలాల సేకరణకు బుధవారం వేలంపాటలు జరిగాయి. తలనీలాల సేకరణ వేలం పాట ద్వారా రూ.5.10లక్షలు, పాదరక్షల భద్రపరిచే గది నిర్వహణకు రూ.14900 ఆదాయం వచ్చింది. గతంతో పోలిస్తే సగం ఆదాయం పడిపోయింది. చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, ఈవో జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మకండ్రిగలో క్రికెట్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జనార్దన చౌదరి

రామచంద్రాపురం, జనవరి 17:సంక్రాంతి సందర్భంగా కమ్మకండ్రిగలో రెండు రోజుల పాటు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆరు జట్లు పాల్గొనగా కమ్మకండ్రిగ ఏ టీం విజేతగా నిలిచింది. వీరికి టీడీపీ జిల్లా నాయకుడు జనార్దన చౌదరి కప్పును అందజేశారు.



గ్రామవీధుల్లో ఊరేగుతున్న ముత్యాలమ్మ - ప్రత్యేక అలంకాంలో ముత్యాలమ్మ

వైభవంగా గుర్రప్ప,ముత్యాలమ్మ ఊరేగింపు

రామచంద్రాపురం, జనవరి 17: కనుమ సందర్భంగా బుధవారం కమ్మకండ్రిగ, రాయలచెరువుతోట గ్రామాల్లో గుర్రప్పస్వామి, ముత్యాలమ్మ ఊరేగింపు వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించి మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం పుష్పపల్లకిలో గుర్రప్పస్వామిని, ముత్యాలమ్మను మేళ తాళాల నడుమ ఊరేగించారు. గ్రామస్థులు మంగళ హారతులు ఇచ్చి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.

పోటెత్తిన 'పులిగుండు'



పెనుమూరు మండలం పులిగుండం వద్ద బుధవారం జరిగిన తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. సంక్రాంతి పండుగ చివరి రోజున తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీ. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. స్వామి దర్శనం కోసం భక్తులు ఎగబడ్డారు. ఉదయం శేష వాహనంపై పార్వతీపరమేశ్వర్లు గిరిప్రదక్షిణగా బయలుదేరారు. కొత్త రోడ్డు, సీఎస్ అగ్రహారం మీదుగా కొండచుట్టుగా పులిగుండుకు చేరుకున్నారు. సాయంత్రం పెనుమూరు శివాలయంలోని పార్వతీ పరమేశ్వరులను పులిగుండుకు తీసుకొచ్చాక భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు, దుకాణదారులకు ఆలయ నిర్వాహకుడు షణ్ముగంరెడ్డి ఏర్పాట్లు చేయగా.. భక్తులకు విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి అన్నదానం, కోలాట భజనలు, పాటకచేరి నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ పవన్‌కుమార్, సీఐ గంగిరెడ్డి, ఎస్‌లు రామాంజనేయులు, వెంకటసుబ్బమ్మ, సిబ్బంది భద్రతా చర్యలు చేపట్టారు.

- పెనుమూరు

టీటీడీ తరపున ఎల్లమ్మకు వస్త్ర సమర్పణ



చంద్రగిరి, జనవరి 17: చంద్రగిరిలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో బుధవారం నిర్వహించిన కొండచుట్టు తిరుణాళ్ళకు ఏటా టీటీడీ అమ్మవారికి, పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ, ఈ సందర్భంగా టీటీడీ తరపున ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పట్టు వస్త్రాలను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, బోర్డు సభ్యులు వీరికి ఘన స్వాగతం పలికి అమ్మవారిని దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే చెవిరెడ్డి పరిశీలించారు.ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా చేపట్టి, వీలైనంత త్వరగా గర్భాలయం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ఎన్నికల బదిలీలు మొదలు

డీఆర్వోగా దేవేంద్రరెడ్డి నియామకం ● నలుగురు తహసీల్దార్లకు స్థానచలనం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 17: కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అధికారుల బదిలీలు ప్రారంభమయ్యాయి. చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ వి.దేవేంద్రరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం డీఆర్వోగా ఎస్.రాజశేఖర్ వ్యవహరిస్తున్నారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సొంత జిల్లాతో పాటు మూడేళ్లకుపైగా జిల్లాలో తహసీల్దార్ హోదాలో విధులు నిర్వహిస్తున్న నలుగురు తహసీల్దార్లు పొరుగుజిల్లాలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీసీఎల్‌ఏ నుంచి మంగళవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో తొలి విడత ఎన్నికల బదిలీలకు శ్రీకారం చుట్టారు.ఈనెల 22న ఓటర్ల తుదిజాబితా విడుదల కానున్న నేపథ్యంలో ఈనెలాఖరుకల్లా మిగిలిన తహసీల్దార్లతో పాటు ఎంపీడీవోలు, జిల్లా అధికారులకు కూడా స్థానచలనం కానుంది. ప్రస్తుతం ఓటరు జాబితా తయారీతో సంబంధం లేకుండా ఇతరత్రా పోస్టుల్లో ఉన్న తహసీల్దార్లను తొలివిడతగా ఇతర జిల్లాకు బదిలీచేశారు. గత ఎన్నికల సమయంలో తహసీల్దార్లను జిల్లాలకు కేటాయిస్తే కలెక్టర్ పోస్టింగ్ ఇచ్చేవారు. ఈసారి నేరుగా మండలాల పోస్టింగ్స్ కూడా సీసీఎల్‌ఏ చేసింది. చిత్తూరు కలెక్టరేట్‌లో ల్యాండ్ రికార్డ్స్ (ఎల్ఆర్) ఏవో కె.పద్మజను కర్నూలు జిల్లా పత్తికొండ తహసీల్దార్‌గా, కలెక్టరేట్ భూవిభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పి.మురళిని కర్నూలు జిల్లా కోసిగి, చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బి.రామాంజుల నాయక్‌ను కర్నూలు జిల్లా చిప్పగిరి తహసీల్దారుగా బదిలీ చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కేఆర్‌సీసీ తహసీల్దారుగా పనిచేస్తున్న టి.జి.మోహనవల్లిని అనంతపురం జిల్లా యాడికి తహసీల్దారుగా బదిలీచేశారు.

వేడుకగా కొండచుట్టు



నగరి, జనవరి 17: నగరి పట్టణంలోని మండపం వద్ద బుధవారం కొండచుట్టును వైభవంగా నిర్వహించారు. కనుమ మరుసటి రోజు ముక్కనుమ రోజున ఈ కొండచుట్టు నిర్వహించడం ఆనవాయితీ. నారాయణవనం నుంచి అన్ని గ్రామాలను చుట్టుకుని నగరికి వచ్చి.. పుత్తూరు మీదుగా తిరిగి నారాయణవణంకు కొండలన్నీ చుట్టుకుని వెళ్లడంతో కొండచుట్టు అనే పేరు వచ్చింది. ఈ నగరి కొండచుట్టులో ఒకే చోట 19 నుంచి 23 దేవతలను దర్శించుకోవచ్చు. కొండచుట్టులో భాగంగా బుధవారం 23 గ్రామాల నుంచి గ్రామదేవతలను స్థానికులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. చిన్నారులు, యువత కేరింతలు.. పెద్దల పూజల నడుమ కొండచుట్టు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మండపం వద్ద దేవతామూర్తులను భక్తులతో పాటు మంత్రి రోజా, నగరి టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్, వైకాపా రాష్ట్ర ట్రేడ్ యూనియన్ నేత కేజే కుమార్ తదితరులు దర్శించుకున్నారు.



చిత్తూరు టీడీపీలో ఐక్యతారాగం



● ఎవరికి టికెట్ వచ్చినా కలిసి పనిచేసేలా ప్రణాళికలు

● ఆశావహులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ● 21 నుంచి కలిసికట్టుగా ఇంటింటికి టీడీపీ

చిత్తూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక వ్యూహంతో ముందడుగు వేయాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించుకుంది. వైసీపీ నుంచి విజయానందరెడ్డిని ప్రకటించిన నేపథ్యంలో టీడీపీ అభ్యర్థి ఎంపిక నిర్ణయం పూర్తిగా అధినేతకే వదిలేయాలని అనుకుంటున్నారు. సంక్రాంతి పండుగకు నారావారిపల్లెకు వచ్చిన చంద్రబాబును కలిసిన నియోజకవర్గ సమన్వయకర్త దొరబాబు ఇక్కడి పరిస్థితులను వివరించారు. అభ్యర్థి ఎంపిక విషయంలో తొందరపడరాదని, ఇంకొంత సమయం తీసుకుంటామని, ఈలోగా అందరూ కలిసి పనిచేసి టీడీపీ బలం ఏమిటో చూపించాలని ఆయన దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే బుధవారం చిత్తూరు టికెట్ ఆశిస్తున్న ఆరుగురిలో నలుగురితో దొరబాబు సమావేశం అయ్యారు. టికెట్ ఎవరికి ప్రకటించినా అందరూ ఐక్యంగానే ఉండి పార్టీ విజయానికి పనిచేయాలని నిర్ణయించుకున్నారు.

ఆరుగురు ఆశావహులు వీళ్లే

చిత్తూరు టీడీపీ టికెట్ ఆశిస్తున్న ఆరుగురు ఆశావహుల్లోని నలుగురితో బుధవారం దొరబాబు పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. డీఏ శ్రీనివాస్ తరపున ఆయన చిన్నాన్న డీకే బద్రినారాయణ హాజరయ్యారు. బుధవారం నాటి మీటింగ్‌కు రాలేకపోయిన చంద్రప్రకాష్‌తో దొరబాబు ఫోనులో మాట్లాడారు. మాజీ మేయర్ హేమలత, జీజేఎం ట్రస్టు చైర్మన్ గురజాల జగన్మోహన్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తిరుచానూరు మాజీ సర్పంచి సీఆర్ రాజన్, జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ ఈ సమావేశానికి హాజరయ్యారు.

విడివిడిగా వద్దు

ప్రస్తుతం చిత్తూరు ఆశావహులు కార్యక్రమాలు విడివిడిగా నిర్వహిస్తున్నారు. ఇక నుంచి పార్టీకి సంబంధించిన ఏ కార్యక్రమంలోనైనా అందరూ కలిసిపాల్గొనాలని తీర్మానించారు. ఆరుగురిలో ఎవరికి టికెట్ వచ్చినా మిగిలినవారు అలగకుండా ఆ ఒక్కరి విజయం కోసం పనిచేయాలని నిర్ణయించారు. ఇక నుంచి ఎవరూ విడిగా కార్యక్రమాలు నిర్వహించకూడదని, విడిగా జెండా బాడ్‌లు కొట్టించుకోవద్దని, విడిగా బ్యానర్లను ఏర్పాటు చేసుకోవద్దని నిర్ణయం తీసుకున్నారు. గురువారం జరగబోయే దివంగత ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల నుంచే ఐక్యత చాటాలని తీర్మానించారు. ఈ మేరకు ఆరుగురు ఆశావహులు కలిసి ఈ నెల 21 నుంచి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. చిత్తూరు నగరంలోని 50 డివిజన్లు, గుడిపాల, చిత్తూరు మండలాల్లోని 44 పంచాయతీల్లో 45 రోజుల్లో ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు.

మిగిలినవారికి సముచిత స్థానం

ఆరుగురు ఆశావహుల్లో టికెట్ వచ్చిన ఒకరి విజయానికి కృషి చేసిన మిగిలిన ఐదుగురికి టీడీపీ అధికారంలోకి వచ్చాక కచ్చితంగా మంచి పదవులు ఇప్పిస్తామని దొరబాబు సూచించారు. చిత్తూరులో జడ్పీ, చుడా, మార్కెట్ కమిటీ, సెంట్రల్ బ్యాంకు చైర్మన్, మేయర్ వంటి పదవులు మిగిలినవారికి దక్కుతాయని వారికి హామీ ఇచ్చారు.

2004లోనూ ఇదే సూత్రం

2004లో జరిగిన సాధారణ ఎన్నికలకు ముందు ఇలాగే ఆశావహులు ఎక్కువైపోయారని, ఆశావహులందర్నీ ఏకతాటిపైకి తెచ్చి సత్ఫలితం సాధించామని చిత్తూరు సమన్వయకర్త దొరబాబు అన్నారు. అప్పట్లో ఏఎస్ మనోహర్, కటారి మోహన్, చంద్రప్రకాష్, రావూరి ఈశ్వరరావు తదితర తొమ్మిది మందితో బృందం ఏర్పడి ప్రజల్లోకి వెళ్లారని, ఈసారి ఆరుగురు వెళ్తున్నామని ఆయన చెప్పుకొచ్చారు. 2004లో ఏఎస్ మనోహర్ గెలిచినట్లు ఈసారి కూడా టీడీపీ అభ్యర్థి గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

జగన్‌రెడ్డికి దున్నపోతుపై వానపడ్డట్టు ఉంది

పండుగలకు దూరంగా అంగన్వాడీల నిరసన

తిరుపతి (రవాణా), జనవరి 17 : రాష్ట్రవ్యాప్తంగా లక్షమందికి పైగా అంగన్వాడీ కార్యకర్తల ఆకలిగోడు పట్టించుకోకుండా దున్నపోతుపై వానపడ్డట్టు ముఖ్యమంత్రి జగన్ వ్యవహరిస్తున్నారని సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేస్తున్న పోరాటం బుధవారం 37వ రోజుకు చేరుకుంది. ఆరుసార్లు చర్చలకు పిలిచి న్యాయం చేయకుండా పండుగలకు కూడా వారిని దూరం చేసి ఆయన పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో తమ సత్తా ఏంటో చూపిస్తామని తిరుపతిలోని శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు హెచ్చరించారు. అదేవిధంగా గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, పుత్తూరు శ్రీకాళహస్తి, చంద్రగిరిలో పండుగలకు దూరంగా దీక్షా శిబిరాల్లోనే అంగన్వాడీ కార్యకర్తలు నిరసన చేపట్టారు. కోటి సంతకాల సేకరణ కొనసాగించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 17 : అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీ గురుమూర్తి కోరారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, ఆర్థిక స్థిరత్వం, సమానత్వం కోసం సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. సామాజిక సమత సంకల్పం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీ గురుమూర్తి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, కమిషనర్ హరిత పూలమాలలు వేసి, మానవహారం చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నేపథ్యంలో ప్రజల్లో సమతా భావాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.46 కోట్లు

తిరుమల,జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.46 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది.ఇక, మంగళవారం 73,016మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,915 మంది తలనీలాలు సమర్పించారు.

చారిత్రాత్మక పార్వేటమండపాన్ని మళ్లీ నిర్మించాలి

తిరుమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో 800 ఏళ్ల చరిత్ర కలిగిన పార్వేటమండపం కాలగర్భంలో కలిసిపోయిందని, దాన్ని వెంటనే పునర్ నిర్మించాలని బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి కోరారు. బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. అలిపిరిలోని పాదాల మండపం పరిశీలన నిమిత్తం వచ్చిన కేంద్ర ఆర్కియాలజీ విభాగం బృందం తిరుమలలోని పార్వేటమండపాన్ని కూడా పరిశీలించి పునర్నిర్మాణం చేసే అంశంపై దృష్టి పెట్టాలని చెప్పిందన్నారు. పార్వేటమండపాన్ని పునర్నిర్మాణం చేసి మరో వెయ్యేళ్ల భక్తులకు దర్శనం చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి ప్రాణప్రతిష్ఠ 22వ తేదీన జరుగుతోందని, ఆ రోజున ప్రతి ఇంటి ముందు ఐదు జ్యోతులను వెలిగించాలని కోరారు. దేశవ్యాప్తంగా ఆలయాల నిర్మాణం జరుగుతుంటే ఏపీలో మాత్రం ఇప్పటివరకు కొన్ని వందల దేవాలయాలు ధ్వంసం చేశారని విమర్శించారు. వాటిని పునర్నిర్మాణం చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు.



భానుప్రకాష్‌రెడ్డి

వెంకన్న సేవలో ప్రముఖులు



నటుడు శ్యామ్

తిరుమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రభుత్వ విప్ కోరుముట్ల శ్రీనివాసులు, తమిళనాడు మంత్రి స్వామినాథన్, తమిళ నటుడు శ్యామ్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

స్విమ్స్‌కు వీల్‌చైర్స్ వితరణ

తిరుపతి సిటీ, జనవరి 17 : స్విమ్స్ న్యూరోసర్జరీ విభాగంలో ఏఎన్‌ఎంగా పని చేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన ఎం.సుధారాణి జ్ఞాపకార్థం ఆమె భర్త సత్య కిషోర్ రూ.50 వేల విలువైన పది వీల్‌చైర్స్‌ను విరాళంగా అందించారు. స్విమ్స్‌లోని డైరెక్టర్ ఛాంబర్‌లో బుధవారం డైరెక్టర్ ఆర్వీ కుమార్‌ను కలిసి వాటిని అందజేశారు. దాత మాట్లాడుతూ తన భార్య ఇదే ఆస్పత్రిలో ఏఎన్‌ఎంగా రోగులకు ఎంతగానో సేవలు అందించిందని, తనవంతుగా ఏదైనా సాయం చేయాలనే ఆలోచనతో వీల్‌ఛైర్స్ అందించానని అన్నారు. దాతను డైరెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సుధారాణి కుమారుడు పార్థు, కుమార్తె తనూజ పాల్గొన్నారు.



వీల్‌చైర్స్‌ను డైరెక్టర్ ఆర్వీ కుమార్‌కు అందజేస్తున్న సత్య కిషోర్

వేదవర్సిటీ రిజిస్ట్రార్‌గా రాధాగోవిందత్రిపాఠి బాధ్యతల స్వీకారం

తిరుపతి(విద్య), జనవరి 17: టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ వేదవర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రాధాగోవిందత్రిపాఠి బుధవారం బాధ్యతలు చేపట్టారు. జాతీయ సంస్కృత వర్సిటీలో శిక్షాశాస్త్రి(ఎడ్యుకేషన్)విభాగ ప్రొఫెసర్‌గా పనిచేసే ఈయనను వర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం వీసీ సమక్షంలో బాధ్యతలను చేపట్టారు. కాగా ఆయన ఇదే వర్సిటీలో ప్రొఫెసర్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్, డిప్యూటీ వార్డెన్, పరీక్షల విభాగంలో ప్రత్యేకాధికారి వంటి వివిధ హోదాలలో పనిచేశారు.



వీసీ రాణీసదాశివమూర్తితో రిజిస్ట్రార్ రాధాగోవిందత్రిపాఠి

అయోధ్యరాముడి ప్రాణ ప్రతిష్ఠ రోజున సెలవు ఇవ్వాలి

తిరుపతి(విద్య), జనవరి17 : అయోధ్యలో ఈనెల 22న నిర్వహించే బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ రోజున రెండు తెలుగు రాష్ట్రాలలోని ఉపాధ్యాయ, ఉద్యోగులకు సెలవు ప్రకటించాలని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల కోరారు. ఈ విషయమై ఇప్పటికే తెలుగు రాష్ట్రాల పాలకులకు లేఖ ద్వారా విన్నవించామని గుర్తుచేశారు. కాగా ఏపీ ప్రభుత్వం సంక్రాంతి సెలవులను ఈనెల 21వరకు పొడిగిస్తూ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువరించిందని, అయితే దేశంలో మహోన్నతంగా తలపెట్టిన శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి 22న సెలవు ఇవ్వకపోవడం బాధాకరమని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠసందర్భంగా తప్పనిసరిగా సెలవు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వ ఐచ్ఛిక సెలవుల్లో హిందువులకు మూడు పండగలు మాత్రమే వచ్చాయని, మరికొన్ని పండగలను(శ్రీపంచమి, నరకచతుర్ధశి, శ్రావణపౌర్ణమి) ఆప్షనల్ హాలిడేస్ జాబితాలో చేర్చాలని కోరారు. రాష్ట్ర సంఘటనా కార్యదర్శి సీహెచ్ శ్రావణ్‌కుమార్, బి.రఘునాథ్, వి.మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల రిలే దీక్ష

తిరుపతి(లీగల్), జనవరి 17: తిరుపతి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే దీక్ష బుధవారం పదవ రోజుకు చేరుకుంది. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసాద్ దీక్షకు సంఘీభావం తెలిపారు.ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఇలాంటి చీకటి చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, దంపూరి భాస్కర్‌యాదవ్, కృష్ణయ్య, ఆనంద్, చందు, కిరణ్‌కుమార్, దిలీప్‌కుమార్, లోకేశ్, పురుషోత్తం, మనోజ్‌కుమార్, సాయి, నవీన్ పాల్గొన్నారు.







అలిపిరి-చెర్లోపల్లె ప్రధాన రహదారి అంచుల్లో గుట్టలు గుట్టలుగా వ్యర్థాలు - నూతనంగా నిర్మిస్తున్న చిన్నపిల్లల ఆస్పత్రి పక్కన చిన్నపాటి గుంత

దోమల దండయాత్ర

- నగరంలో పేరుకుపోయిన చెత్త నిల్వలు
- స్తంభించిన మురికి కాలువలు
- ఖాళీ స్థలాల్లో లోపించిన శుభ్రత
- నిద్రావస్థలో కార్పొరేషన్ అధికారులు



తిరుపతి(కొర్లగుంట), జనవరి 17 : నగర ప్రజలపై దోమలు ముప్పేట దాడి చేస్తున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా లెక్క చేయకుండా రక్తాన్ని పీల్చేస్తున్నాయి. ఫలితంగా పలువురు రోగాల బారినపడి ఆస్పత్రుల దారి పట్టాల్సి వస్తోంది. ఇటీవల కొన్ని రోజులు మున్సిపల్ కార్మికులు సమ్మెకు దిగడంతో నగరంలో ఎటుచూసినా చెత్తకుప్పలు పేరుకుపోయాయి. డ్రైనేజీలు స్తంభించాయి. కొందరు చెత్తను ఇళ్లలో ఉంచుకోలేక రోడ్ల పక్కన పడేశారు. అలిపిరి-చెర్లోపల్లె రోడ్డు అంచుల్లో అయితే చెత్తమూటలు గుట్టగుట్టలుగా దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు పలు ప్రాంతాల్లో చిన్న చిన్న గుంటలు, బావుల్లో నీరు నిల్వ ఉంటూ పాచిపట్టాయి. వాటిని ఆవాసాలుగా చేసుకుని దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. వర్షానికి లార్వ ఇడిగి దోమల సంఖ్య విపరీతంగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేనంతగా దాడిచేస్తున్నాయి. వాటి దాడి నుంచి తప్పించుకునేందుకు ఫ్యాన్ వేసినా, జట్ కాయిల్స్, ఆలౌట్ లాంటివి వాడినా లాభం లేకపోతోంది. దోమ తెరలు కట్టినా ఏదోలా లోపలికి వచ్చి కుట్టేస్తున్నాయి. తద్వారా జ్వరం, దగ్గు వంటి జబ్బులతో ఆస్పత్రులకు క్యూకడుతున్నారు. ఇలా నగర ప్రజలు సతమతమవుతున్నా మున్సిపల్ ఆరోగ్య విభాగం స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది. దోమల నివారణ చర్యలు చేపట్టే ఆలోచన కూడా చేయడం లేదు. వీధులు, కాలువల్లో క్రిమిసంహారక మందుల పిచికారీ, ప్రత్యేక యంత్రం ద్వారా వదిలే పొగ వంటి వాటిపై దృష్టి సారించపోవడం విమర్శలకు తావిస్తోంది. పన్నులు ముక్కుపిండి వసూలు చేస్తారు కాని సౌకర్యాల కల్పన గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

22న ఓటర్ల తుది జాబితా ప్రచురించాలి

- పోలా భాస్కర్



అధికారులతో మాట్లాడుతున్న పోలా భాస్కర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 17: ఓటర్ల తుది జాబితాను ఈనెల 22న ప్రచురించాల్సి ఉంటుందని రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ ఆదేశించారు. మరుసటి రోజు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆ జాబితాను అందించాలని సూచించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఈఆర్వోలతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ వివరిస్తూ జిల్లాలో ముసాయిదా జాబితా గత అక్టోబరు 27న ప్రకటించామని, అన్ని రకాల ఫారమ్స్ 4,15,235 అందాయని, అందులో 0.17శాతం మాత్రమే పరిశీలనలో ఉన్నాయని, మిగిలినవి పూర్తి చేశామని తెలిపారు. 22న తుది జాబితా ప్రచురణకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. పోలా భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో అందిన ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కరించాలన్నారు. ఏఈఆర్వోలు, ఈఆర్వోలు పూర్తిస్థాయిలో మరోసారి పరిశీలించి ఓటర్ల జాబితా, సీరియల్ నంబర్లు వంటివి నిర్ధారణ చేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించి, రసీదు పొందాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పునకు సంబంధించి ఫైల్స్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమీక్షలో తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, డీఆర్వో పెంచలకిషోర్, ఆర్డీవోలు కిరణ్‌కుమార్, నిషాంత్‌రెడ్డి, చంద్రముని, శివశంకర్‌రెడ్డి, ఏఈఆర్వోలు, సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంభూపాల్‌రెడ్డి

షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం

- పీసీసీ ఉపాధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 17: వై.ఎస్.షర్మిళ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా నియామకం కావడంతో పార్టీకి పూర్వవైభవం రానుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి నుంచి బలోపేతానికి ఏఐసీసీ ఆధ్వర్యంలో పార్లమెంటరీ కో ఆర్డినేటర్లను నియమించాలని కోరారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీని వీడిన ముఖ్య నాయకులు, ప్రధాన భూమిక పోషించిన కార్యకర్తలు తిరిగి పార్టీలోకి రావడానికి మొగ్గు చూపుతున్నారని అన్నారు. ఇండియా కూటమితో దేశంలోనే గాక రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అభ్యర్థులు కొన్ని అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ కార్యదర్శి గౌడపేరు చిట్టిబాబు మాట్లాడుతూ వెనుకబడిన, అణగారిన వర్గాల వారిని వైసీపీ ప్రభుత్వం అణచివేతకు గురిచేసిందన్నారు. జగన్ ప్రభుత్వానికి నూకలు చెల్లిపోయాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సిద్ధయ్య, శివశంకర్, ప్రేమ్‌సాగర్, సుబ్రహ్మణ్యం, రఘు, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ముందు డీఎస్సీ ప్రకటన మోసం కాదా?

- తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు



తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 17 : నెల రోజుల్లో ఎన్నికల షెడ్యూలు వస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటిస్తామనడం ఓట్ల కోసం కాదా అని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు ప్రశ్నించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు అధికారంలోకి రాగానే మొదటి నెలలోనే మెగా డీఎస్సీని ప్రకటిస్తానని చెప్పి నిరుద్యోగులను నిలువునా ముంచేశారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తవుతున్నా ఒక్క డీఎస్సీని కూడా ప్రకటించలేదని అన్నారు. వేలకు వేలు ఖర్చు చేసి, డీఎస్సీ కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు సమాజంలో తలెత్తుకుని తిరగలేక ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. కొందరు గంజాయికి, డ్రగ్స్‌కు, మద్యానికి బానిసలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవన్నీ జగన్ ఇచ్చిన బూటకపు హామీల వలనే జరిగాయని ఆరోపించారు. ఇంత మోసపూరితమైన ముఖ్యమంత్రిని ఎక్కడా చూడలేదన్నారు. 9,771ప్రైమరీ పాఠశాలలను విలీనం చేసి, విద్యావ్యవస్థను సర్వనాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేశారని మండిపడ్డారు. ఎన్నికలు నెల రోజుల్లో ఉండగా మంత్రి బొత్స సత్యనారాయణ సంక్రాంతి తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని చెప్పడం ఎవరిని మోసం చేయడానికో చెప్పాలని నిలదీశారు. వైసీపీని గద్దె దించే వరకు యువత పోరాటం చేస్తుందన్నారు. డీఎస్సీ అభ్యర్థులు మంత్రిని కలవాలని ప్రయత్నం చేస్తే అరెస్టు చేసే పరిస్థితి నెలకొందన్నారు. సీఎం కోసం తాడేపల్లి ప్యాలెస్‌కు వెళితే పోలీసులు అడ్డుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వం మూడు డీఎస్సీలను పెట్టి, వేలాది మంది టీచర్లను నియమించిందని, అందుకే డీఎస్సీ అభ్యర్థులు మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అక్కింతల కృష్ణయాదవ్, తెలుగు యువత నాయకులు వాసు, కరణం సందీప్, రఫీ, శ్రీరామ్ బాబీ, దిలీప్‌రాయల్, గోపి తదితరులు పాల్గొన్నారు.

కాజేసిన సర్పంచుల నిధులను ఇప్పించండి

తిరుపతి(కొర్లగుంట), జనవరి 17 : రాష్ట్ర ప్రభుత్వం కాజేసిన రూ.9,229 కోట్ల సర్పంచుల నిధులను ఇప్పించాలని కేంద్ర మంత్రి కపిల్ మోరేశ్వర్‌పాటిల్‌కు పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య వినతిపత్రం సమర్పించారు. బుధవారం రాత్రి కేంద్రమంత్రి శ్రీవారి దర్శనార్థం వచ్చిన సందర్భంగా నంది కూడలి వద్ద బీజేపీ నేత గుండాల గోపినాథ్ రెడ్డితో కలిసి ఆయన స్వాగతం పలికి, సత్కరించారు. సుబ్బరామయ్య మాట్లాడుతూ నిధుల దారి మళ్లింపు నేపథ్యంలో గతేడాది ఆగస్టు 2న ఢిల్లీలో కలిశామని, ఇంతవరకు ఎలాంటి స్పందనా లేదని తెలిపారు. తాజాగా నాలుగు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.985కోట్ల నిధుల్లోనూ రూ.600కోట్లు నిలుపుదల చేసినట్లు వివరించారు. తమ నిధులు ఎలాగైనా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ధనంజయయాదవ్, మురళి, కిరణ్‌యాదవ్, రమేష్‌నాయుడు, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న సుబ్బరామయ్య

హత్యాయత్నం కేసులో నలుగురికి రిమాండ్

తిరుపతి(లీగల్), జనవరి 17: ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన నలుగురు నిందితులకు 15 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.వాణిశ్రీ ఆదేశించారు. ఈనెల 14న తిరుపతి రుయా ఆస్పత్రి ప్రాంగణం వద్ద తిరుపతి శ్రీనివాసనగర్‌కు చెందిన పి.గిరిపై హత్యాయత్నానికి పాల్పడ్డ వెస్ట్ రైల్వేస్టేషన్ శ్రీనివాసనగర్‌కు చెందిన ఎ.భానుప్రకాష్, పి.జగదీష్‌కుమార్ ఈడిగపల్లె రితేష్ బాబు, ఈడిగపల్లె అజయ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని, కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన కోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది.

రా..కదలిరా సభకు తరలిరండి : టీడీపీ

తిరుపతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వెంకటగిరిలో శుక్రవారం జరగనున్న టీడీపీ అధినేత చంద్రబాబు 'రా..కదలిరా' బహిరంగ సభకు పెద్దయెత్తున తరలిరావాలని టీడీపీ నేతలు కోరారు. కపిల తీర్థం సమీపంలోని పార్టీ కార్యాలయంలో తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ప్రత్యేక పరిశీలకుడిగా హాజరైన ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, ఏలూరు సాంబశివరావు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, పర్వీన్ తాజ్, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు సురేంద్ర కుమార్ మాట్లాడుతూ నగరంలోని క్లస్టర్ ఇన్‌చార్జులు, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ అధికారంలోకి తీసుకొచ్చేవరకు పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బీఎల్ సంజయ్, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, దంపూరి భాస్కర్, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, బుల్లెట్ రమణ, శ్రీహరినాయుడు, చిన బాబు, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, రవినాయుడు, కృష్ణయాదవ్, రుద్రకోటి, పుష్పావతి, దినకర్, లక్ష్మీపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న నేతలు

రేపటి నుంచి కులగణన సర్వే

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 17: తిరుపతి జిల్లాలో శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు కులగణన సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కులగణన సర్వే చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కులాల వారీగా జనాభా, సామాజిక, విద్య, ఆర్థిక పురోగతి తెలుసుకోవడానికి, సంక్షేమ ఫలాలు అందించడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. కులగణనకు వచ్చే వారికి ప్రజలు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రీఫైనల్ పరీక్షలు

తిరుపతి(విద్య), జనవరి17 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కళాశాలల్లో ఇంటర్ కోర్సులు చదివే విద్యార్థులకు ఈ నెల 19నుంచి 25వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఐఈవో స్వర్ణలత పేర్కొన్నారు. నిర్ణీత తేదీలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 10-1 గంట వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2-5గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

తర్పణాలకు విశాల ప్రదేశమివ్వండి

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 17 : పర్వదినాల్లో పితృ దేవతలకు తర్పణాలు వదలడానికి నగర పరిధిలోని కపిలతీర్థానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారని, అందుకోసం విశాలమైన ప్రదేశం కేటాయించాలని కపిలేశ్వర పురోహిత సేవా సంఘం గౌరవ సలహాదారు సంస్కార్ రాజేష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన సంఘం కార్యదర్శి పారా విజయకుమార్‌తో కలిసి మాట్లాడుతూ రెండు రోజుల క్రితం సంక్రాంతి రోజున పితృ తర్పణ కార్యక్రమానికి కపిలతీర్థానికి వేలాది మంది రావడంతో కొంత అసౌకర్యం కలిగిందన్నారు. ఈ క్రమంలోనే కొంతమంది శ్రీవారి సంఘం పేరుతో వివిధ ప్రాంతాల నుంచి ముందురోజు రాత్రే చేరుకుని పట్టలు పరిచారన్నారు. దీంతో స్థానికంగా ఉండే బ్రాహ్మణులు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని తెలిపారు. టీటీడీ నిఘా అధికారులు గుర్తింపు ఉన్న వారినే క్రమ పద్ధతిలో కూర్చోపెట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అన్నదానం అనిల్, కోశాధికారి మోహనశర్మ, విశ్వనాథం, శ్రీనివాసులు, హరి, హేమంత్, గురుమూర్తి, విజయభాస్కర్, లీలా రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కొండచుట్టు



మండపం వద్ద సందడి

నగరి, జనవరి 17: నగరి పట్టణంలోని మండపం వద్ద బుధవారం కొండ చుట్టును వైభవంగా నిర్వహించారు. కనుమ మరునటి రోజు ముక్కనుమ రోజున ఈ కొండచుట్టు నిర్వహించడం ఆనవాయితీ. నారాయణవనం నుంచి అన్ని గ్రామాలను చుట్టుకుని నగరికి వచ్చి.. పుత్తూరు మీదుగా తిరిగి నారాయణవణంకు కొండలన్నీ చుట్టుకుని వెళ్లడంతో కొండచుట్టు అనే పేరు వచ్చింది. ఈ నగరి కొండచుట్టులో ఒకే చోట 19 నుంచి 23 దేవతలను దర్శించుకోవచ్చు. కొండచుట్టులో భాగంగా బుధవారం 23 గ్రామాల నుంచి గ్రామదేవతలను స్థానికులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. చిన్నారులు, యువత కేరింతలు.. పెద్దల పూజల నడుమ కొండచుట్టు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మండపం వద్ద దేవతామూర్తులను భక్తులతో పాటు మంత్రి రోజా, నగరి టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్, వైకాపా రాష్ట్ర ట్రేడ్ యూనియన్ నేత కేజే కుమార్ తదితరులు దర్శించుకున్నారు.



వివిధ గ్రామాలనుంచి వచ్చిన దేవతా మూర్తులు

నేటి నుంచి హెల్తీ విలేజ్ జాతీయ సదస్సు

ముస్తాబైన మహిళా యూనివర్శిటీ

వివిధ రాష్ట్రాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు రాక

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 17: కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో పద్మావతి విశ్వవిద్యాలయం వేదికగా గురువారం నుంచి మూడు రోజుల పాటు సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల స్థానికీకరణపై ఆరోగ్యకరమైన గ్రామం(హెల్తీ విలేజ్) జాతీయ సదస్సు జరగనుంది. కలెక్టర్ వెంకటరమణా రెడ్డి ఆధ్వర్యంలో వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి ఏర్పాట్లను పరిశీలించారు. వైద్యశాఖ, డీఆర్‌డీఏ, మెప్మా, టీటీడీ, మహిళా శిశు సంక్షేమ శాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మొదటిరోజు కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షిస్తారు. ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ మంత్రి (పంచాయతీరాజ్‌శాఖ మంత్రి) కపిల్ మోరేశ్వర్ పాటిల్ పాల్గొంటారు. రాష్ట్రం నుంచి డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బుడి ముత్యాలనాయుడు, జిల్లా మంత్రులు హాజరవుతారు. వివిధ రాష్ట్రాల నుంచి 800మంది ప్రతినిధులు హాజరవుతారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో ముఖ్య అతిథి సందేశం తర్వాత వివిధ రాష్ట్రాల మధ్య చర్చలు జరుగుతాయి. శనివారం జిల్లాలోని ఆదర్శగ్రామాల్లో 250 మంది అతిథుల క్షేత్రస్థాయి సందర్శన ఉంటుంది.



సదస్సు ఏర్పాట్లును పరిశీలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

కోట, జనవరి 17: కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని వావిళ్ల దొరువు దళితవాడకు చెందిన ఇంగిలాల వెంకటరమణయ్య(55) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు. వావిళ్ల దొరువు దళితవాడకు చెందిన వెంకటరమణయ్య గ్రామానికి సమీపంలో ఉన్న ఉప్పునీటి కాలువలో చేపలు పట్టేందుకు మంగళవారం వెళ్లాడు. చేపలు పడుతూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. వెంకటరమణయ్య ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల విచారించిన ఆచూకీ లభించలేదు. పశువుల కాపర్లు కాలువ ఒడ్డున వెంకటరమణయ్య మృతదేహాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు వెళ్లి మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు.

23న వెంకటగిరి మండల మీట్

వెంకటగిరి టౌన్, జనవరి 17: వెంకటగిరి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తంబిరెడ్డి తనూజా అధ్యక్షతన ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో విజయలక్ష్మి బుధవారం తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ, అధికారులు హాజరుకావాలని కోరారు.

దుమ్ము లేస్తోంది..!

- అధ్వానంగా వరగలి క్రాస్ - తమ్మినపట్నం రోడ్డు
- నిత్యం భారీ వాహనాల రాకపోకలు
- దారి పక్కన ఇళ్లలోకి చేరుతున్న దుమ్ము
- అవస్థలు పడుతున్న వాహనదారులు, స్థానికులు

చిల్లకూరు, జనవరి 17: చిల్లకూరు మండంలోని వరగలి క్రాస్ - తమ్మినపట్నం ప్రధాన రహదారి గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉంది. తీర ప్రాంతంలోని పలు పరిశ్రమలకు రాకపోకలు సాగించే భారీ వాహనాలతో పాటు అధిక లోడుతో సిలికా రవాణా చేసే వాహనాల వల్ల రోడ్డు బాగా దెబ్బతింది. సుమారుగా 20 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ దారిలో భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము లేస్తోంది. దీంతో దారిపక్కన నివాసం ఉండేవారితో పాటు వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా పారిచెర్లవారిపాళెం, చేడిమాల, తిక్కవరం, కలవకొండ, రామారెడ్డిపాళెం, చింతవరం, ఏరూరు తదితర గ్రామాల ప్రజలు వాహనాల రాకపోకలతో లేస్తున్న దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారు. అసలే భారీ గుంతలు ఏర్పడి రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులతో పాటు ఆటోలు, బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు నకయాతనపడుతున్నారు. ఇటీవల కలవకొండ గ్రామస్తులు తమ ఇళ్లలోకి దుమ్ము చేరుతోందని వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. దీంతో రెండు రోజులు రోడ్డుపై దుమ్ములేవకుండా నీళ్లు పడుతున్నారు. అయితే అధికంగా నీళ్లు పడుతుండడంతో రోడ్డు బురదమయంగా మారుతోందని వాహనాదారులు అంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



వాహనాల రాకపోకలతో రోడ్డుపై దుమ్ము





కోటలో షోకాజ్ నోటీసులకు జవాబు పత్రాలతో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు - వెంకటగిరిలో దీక్ష

అంగన్వాడీలపై కక్ష సాధింపు మానుకోవాలి

సూళ్లూరుపేట, జనవరి 17: న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని అంగన్వాడీలు పండుగ దినాల్లో సైతం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం న్యాయం చేయకుండా కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడడం అన్యాయమని యూనియన్ నాయకురాలు హైమావతి అన్నారు. బుధవారం స్థానిక హోలిక్రాస్ సెంటర్ వద్ద శిబిరంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షోకాజ్‌లు అందజేసి బెదిరిస్తే భయపడేది లేదని, తమ డిమాండ్లను అంగీకరించకుంటే విధులకు హాజరుకాబోమని తేల్చి చెప్పారు. మహిళలు నెల రోజుల పైబడి రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని సీఐటీయూ నాయకుడు పద్మనాభయ్య అన్నారు. అనంతరం ఆందోళన శిబిరం నుంచి సీడీపీవో ప్రాజెక్టు కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి షోకాజ్ నోటీసులకు సమాధానం రాసి సీడీపీవో శారదాంబకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

గూడూరు: అంగన్వాడీల న్యాయమైన సమస్యలను రాష్ట్రప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 37వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సమ్మె చేస్తుంటే రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అంగన్వాడీలను బెదిరింపులకు గురిచేసేందుకు ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం మంచిపద్ధతి కాదన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, ప్రసాద్, చంద్రయ్య, ఇంద్రావతి, ప్రభావతి, మునికుమారి, లక్ష్మి, పెంచలమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని బంగారుపేట వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేస్తున్న రిలే దీక్ష బుధవారం 37వ రోజు కొనసాగింది. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు దీక్ష విరమించే ప్రసక్తే లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, స్వరూపారాణి, సుభాషిణి, మంజుల, ఐఎఫ్‌టీయూ నాయకులు మమ్ములాబేగం, లక్ష్మీప్రసన్న, అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

కోట: షోకాజ్ నోటీసులకు బెదిరేదిలేదని, భేషరతుగా జవాబు ఇస్తామని అంగన్వాడీలు స్పష్టం చేశారు. కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట బుధవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీలు నిరసన తెలిపారు. ప్రభుత్వం ఈ నెల 10వ తేదీన అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులను జారీ చేసింది. ఆ షోకాజ్ నోటీసులు తీసుకోకుండానే ఆయా మండలాల అంగన్వాడీలు తమదైన శైలిలో నోటీసులకు జవాబు పత్రాలను రాసి పంపుతున్నట్లు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు.

నాయుడుపేట టౌన్: అంగన్వాడీల సమ్మె 37వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన షోకాజ్ నోటీసులను కొంతమంది అంగన్వాడీలు తిరస్కరించారు. మరి కొంత షోకాజ్ నోటీసులు అందుకొని వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీఐటీయూ మండలాధ్యక్షుడు ముకుంద, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, మారెమ్మ, కళావతి, వాణి, నంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి దేవసింగ్ చౌహాన్

రాముడి విగ్రహ ప్రతిష్ఠను పండుగలా జరుపుకోవాలి: కేంద్రమంత్రి

కోట, జనవరి 17: అయోధ్యలో ఈ నెల 22వ తేదీన రామమందిరంలో జరగనున్న శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను ప్రతి హిందువూ పండుగలా జరుపుకోవాలని కేంద్ర మంత్రి దేవసింగ్ చౌహాన్ కోరారు. కోట మండలం జరుగుమల్లిలో బుధవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి పురుషోత్తంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, ఉపాధ్యక్షుడు భైరప్ప, పనబాక కోటేశ్వరరావు, సారంగం రమేష్‌బాబు, ఉచ్చూరు రవీంద్రరెడ్డి, కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కులగణన సర్వే

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 17: తిరుపతి జిల్లాలో శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు కులగణన సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణా రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కులగణన సర్వే చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కులాల వారీగా జనాభా, సామాజిక, విద్య, ఆర్థిక పురోగతి తెలుసుకోవడానికి, సంక్షేమ ఫలాలు అందించడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. కులగణనకు వచ్చే వారికి ప్రజలు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రీఫైనల్ పరీక్షలు

తిరుపతి(విద్య), జనవరి17 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కళాశాలల్లో ఇంటర్ కోర్సులు చదివే విద్యార్థులకు ఈ నెల 19నుంచి 25వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఐఈవో స్వర్ణలత పేర్కొన్నారు. నిర్ణీత తేదీలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 10-1 గంట వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2-5గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

జగన్‌రెడ్డికి దున్నపోతుపై వానపడ్డట్టు ఉంది

తిరుపతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా లక్షమందికి పైగా అంగన్వాడీ కార్యకర్తల ఆకలిగోడు పట్టించుకోకుండా దున్నపోతుపై వానపడ్డట్టు ముఖ్యమంత్రి జగన్ వ్యవహరిస్తున్నారని సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేస్తున్న పోరాటం బుధవారం 37వ రోజుకు చేరుకుంది. ఆరుసార్లు చర్చలకు పిలిచి న్యాయం చేయకుండా పండుగలకు కూడా వారిని దూరం చేసి ఆయన పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో తమ సత్తా ఏంటో చూపిస్తామని తిరుపతిలోని శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు హెచ్చరించారు. అదేవిధంగా గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, పుత్తూరు శ్రీకాళహస్తి, చంద్రగిరిలో పండుగలకు దూరంగా దీక్షా శిబిరాల్లోనే అంగన్వాడీ కార్యకర్తలు నిరసన చేపట్టారు. కోటి సంతకాల సేకరణ కొనసాగించారు.

పండుగలకు దూరంగా అంగన్వాడీల నిరసన



ఎన్టీఆర్ వర్ధంతిని జయప్రదం చేద్దాం: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, జనవరి 17: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ 28వ వర్ధంతిని గురువారం జయప్రదం చేద్దామని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం వారు మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు కేఎన్ రోడ్డు కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించిన తరువాత, కెనరా బ్యాంకు ఎదురుగా మెగా వైద్య శిబిరం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ హాజరుకానున్నట్లు తెలిపారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్, బాలకృష్ణ, నారా చంద్రబాబునాయుడు, గాలి ముద్దుకృష్ణమనాయుడు, గాలి భానుప్రకాష్ అభిమానులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మధవనాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ ధనపాల్, మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్లు బీఆర్ యుగంధర్, ఆనంగి ఆనంద్, 22వ వార్డు అధ్యక్షుడు కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులు



టీడీపీలో చేరిన నాయకులతో భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 17: మున్సిపల్ పరిధిలోని ఐదవ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు బుధవారం టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కుమార్, జ్యోతి, నాగరాజు, తిరుణావక్కరసు, యువరాజు, శరవణ, ముత్తు, కేశవ, ముత్తువేల్, షణ్ముగ, కార్తీక్‌తో పాటు పిళ్లారిపట్టు దళితవాడకు చెందిన బాబు, సుబ్రహ్మణ్యం, దినేష్, ప్రవీణ్‌కుమార్, విజయ్‌కుమార్, మునిశేఖర్, ఉమామహేష్ తదితరులు పార్టీలో చేరారు. వీరందరినీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన భానుప్రకాష్ అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ టీడీపీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా గిరి ప్రదక్షిణ



చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి

నారాయణవనం, జనవరి 17: మండల పరిధిలోని సముదాయం గ్రామంలో బుధవారం కొండచుట్టు ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉదయం నారాయణవనంలోని చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి, సముదాయం గ్రామంలోని మరకతవల్లి సమేత అగస్త్యీశ్వరస్వామి, సముదాయంలోని అరుణానదిలో స్వామివార్ల సంధింపు వేడుక జరిగింది. అనంతరం పరాశరేశ్వరస్వామి నారాయణవనంలోని పురవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. అక్కడ నుంచి తుంబూరుకు వెళ్లి తుంబీశ్వరస్వామిని, అనంతరం పాలమంగళం పాలేశ్వరస్వామి సంధింపు చేసుకుని, సాయంత్రం అగస్త్యీశ్వరస్వామివారితో కలిసి ఊరేగింపుగా రాత్రికి నగరిలోని కొండచుట్టు మండపానికి చేరుకున్నారు. సముదాయం గ్రామస్తులు, రైతులు గోవులను సుందరంగా అలంకరించి సంధింపలో స్వామివారికి ఎదురుగా వదలడం భక్తులను అలరించింది. అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

తెలుగు మహిళకు నివాళి

వడమాలపేట, జనవరి 17: మండలంలోని ఓటీఆర్ కండ్రిగకు చెందిన తెలుగు మహిళ నాయకురాలు ఎస్.తులసమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి నగరి ఇన్‌చార్జి గాలి భాను ప్రకాష్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, తెలుగు రైతు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర రావ్, నాయకులు బాబు, మురళి, చైతన్య తదితరులు నివాళులర్పించారు.

మీకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించండి: భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 17: 'మీకు సేవ చేసే భాగాన్ని నాకు కల్పించండి... నగరి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కిస్తా... రానున్న ఎన్నికల్లో టీడీపికి మద్దతుగా మీరు ఉండడండి... మీకు అండగా నేను ఉంటా' అని నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. బుధవారం పుత్తూరు మున్సిపల్ పరిధిలోని ఒకటవ వార్డు కట్టకింద రామకృష్ణాపురం, కొత్త తిమ్మాపురం, పాతపల్లూరు, మిట్టపల్లూరు, ఆదిఆంధ్రవాడ, 5వ వార్డు పరిధిలోని పిళ్లారిపట్టు, దళితవాడ, గణపతినగర్, తాయిమాంబాపురం, చౌటూరు, బంగారుపల్లి, గంగమాంబాపురంలో మీతో మీ తెలుగుదేశం, బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో అభివృద్ధి పనుల కన్నా, అవినీతి ఎక్కువగా జరిగిందని ఎద్దేవా చేశారు. రోడ్లు వేయలేదు గానీ, గ్రావెల్, కంకర, ఇసుక, మట్టిని దోచుకుని సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు కనీసం మరమ్మతులు కూడా చేయించలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం పాలన చేస్తోందని దుయ్యబట్టారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే మహోన్నత ఆశయంతో గత ప్రభుత్వ హయాంలో కుందేలు గుట్ట వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టి 90 శాతం పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మిగిలిన పది శాతం పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు ఏలినవారికి ఐదేళ్ల సమయంలో సరిపోలేదా అని నిలదీశారు. మరో మూడు నెలల తరువాత మీ అందరి ఆశీర్వాదంతో రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం వస్తుందని, అర్హులైన లబ్ధిదారులకు సొంతింటికలను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. కాగా, ప్రచారానికి వచ్చిన గాలి భానుప్రకాష్‌కు స్థానికులు అడుగడుగునా నీరాజనం పలికారు. ఒకవట వార్డులో ప్రతి ఇంటి వద్ద కర్పూరహారతులివ్వడంతో పాటు పూలవర్షం కురిపించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, మణిరెడ్డి, సంతోష్, అర్జున్‌రెడ్డి, చొక్కలింగారెడ్డి, చిరంజీవి, వెంకటముని, ఆర్ముగంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఆర్ యుగంధర్, ఐదవ వార్డు నాయకులు ఏలుమలైరెడ్డి, నాగరాజు, అయ్యప్పరెడ్డి, కుమార్, చిరంజీవి, వెంకటేష్, దినేష్ పాల్గొన్నారు.



బైక్‌లతో ర్యాలీగా ప్రచారానికి వెళుతున్న గాలి భానుప్రకాష్

అంగన్వాడీలకు న్యాయం జరిగే వరకు పోరాటం



దీక్ష చేస్తున్న అంగన్వాడీలు

పుత్తూరు అర్బన్, జనవరి 17: అంగన్వాడీ కార్యకర్తలకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని విరమించే ప్రసక్తే లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రిలే నిరాహారదీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 37 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం కనికరం చూపకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే క్రీడలకు ప్రోత్సాహం

పుత్తూరు అర్బన్, జనవరి 17: టీడీపీ హయాంలోనే క్రీడలను ప్రోత్సహించినట్లు ఆ పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ తెలిపారు. బుధవారం గేటు పుత్తూరులోని కోమిటోల్ల బావి వద్ద నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఒక ఫార్సుగా అభివర్ణించారు. ఈ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో క్రీడా మైదానాల నిర్మాణం, అభివృద్ధి కోసం ఎంత నిధులు వెచ్చించారో బహిర్గతం చేయాలని సవాల్ విసిరారు.

వైభవంగా ముక్కనుమ



వడమాలపేట, జనవరి 17: మండల పరిధిలోని ఎస్‌బీఆర్ పురంలో సంక్రాంతి సందర్భంగా ఆఖరి రోజు బుధవారం ముక్కనుమ పండుగను వేడుకగా నిర్వహించారు. సర్పంచు మనిరాజు ఆధ్వర్యంలో గ్రామంలోని వేణుగోపాలస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేణుగోపాలస్వామి, మాతమ్మ తల్లిని మంగళవాయిద్యాల నడుమ, భక్తుల ప్రత్యేక నృత్య ప్రదర్శనల నడుమ ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలతో మొక్కులు తీర్చుకున్నారు.

సమస్యల పరిష్కారం కోసమే సమ్మె


వివరణ సమర్పిస్తున్న అంగన్వాడీలు

శ్రీకాళహస్తి, జనవరి 17:తమ సమస్యల పరిష్కారం కోసమే నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నామని అంగన్వాడీలు తెలిపారు.శ్రీకాళహస్తి పట్టణంలోని ఐసీడీఎస్ కేంద్రం వద్ద బుధవారం రిలే దీక్షతో సమ్మెను కొనసాగించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు ఐసీడీఎస్ సిబ్బందికి వివరణ సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం తమ సమస్యలను దీర్ఘకాలికంగా పరిష్కరించ లేదన్నారు. ఎన్నికలకు ముందు తమకు ఇచ్చిన హామీల అమలు కోసమే సమ్మె చేస్తున్నామని వెల్లడించారు.

జగన్ వైఖరితోనే సమ్మె

పిచ్చాటూరు, జనవరి 17: సీఎం జగన్ మాట తప్పడంతోనే అంగన్వాడీలు సమ్మెలో పాల్గొంటున్నారని... వారిపై కక్షగట్టి కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం అన్యాయమని సీఐటీయూ రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్దన్ పేర్కొన్నారు. బుధవారం అంగన్వాడీలకు ఆయన సంఘీభావం తెలిపారు. సమ్మెలో పాల్గొంటున్న వారికి వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభకనబరచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

మా పోరాటం ఆగదు


సత్యవేడులో సమ్మె చేస్తున్న అంగన్వాడీలు

సత్యవేడు, జనవరి 17: తమ డిమాండ్లు సాధించుకునే వరకూ పోరాడి తీరుతామని అంగన్వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. సత్యవేడులోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె బుధవారం 37వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు నిర్మల మాట్లాడుతూ రాజకీయ, అధికారుల బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను సాధించేంత వరకు పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుందని తెలిపారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, డీవైఎఫ్ఐ నేత మురళి, అంగన్‌వాడీ కార్యకర్తలు శాంతి, ఝాన్సీ, భారతి, భువన, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను జయప్రదం చేద్దాం


మీడియా సమావేశంలో శ్రీధర్ రెడ్డి, సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 17: వెంకటగిరిలో శుక్రవారం జరగనున్న టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగ సభ ను జయప్రదం చేయాలని శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలోని ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకునేందుకు ప్రజలంతా చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు.వచ్చే ఎన్నికల్లో శ్రీకాళహస్తిలో టీడీపీ జెండా రెపరెపలాడడం ఖాయమని జోస్యం చెప్పారు.శ్రీకాళహస్తి టీడీపీ ఇన్చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు,పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, పార్లమెంట్ కోశాధికారి కంఠా రమేష్, తెలుగు మహిళ అధ్యక్షురాలు చక్రాల ఉష, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న ఈవో రామారావు

శ్రీకాళహస్తి, జనవరి 17: ముక్కంటి ఆలయంలో నిత్యాన్నదాన పథకాన్ని బుధవారం ఈవో రామారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులతో మాట్లాడారు.ఇంజనీరింగ్ విభాగాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పలు నిర్మాణాల పురోగతిపై సూచనలు చేశారు.

కుక్కను తప్పించబోయి...!

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం ● ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, జనవరి 17: కుక్కను తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం శ్రీకాళహస్తిలో చోటు చేసుకుంది.బహదూర్ పేటకు చెందిన యశ్వంత్ హోటల్లో వంట మాస్టర్‌గా పనిచేస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన చందు ఇంటర్ చదువుతున్నారు.ఇద్దరూ ద్విచక్ర వాహనంపై బజారుకు వస్తున్న క్రమంలో బహదూర్ పేట వద్ద కుక్క అడ్డు రావడంతో వాహనం అదుపు తప్పింది. రోడ్డుపై పడడంతో ఇద్దరికీ తలపై బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

రాయలవారి ఆశయాలు మహోన్నతం


శ్రీకృష్ణదేవరాయలకు నివాళులర్పిస్తున్న ప్రముఖులు

శ్రీకాళహస్తి జనవరి 17: శ్రీకృష్ణదేవరాయల ఆశయాలు మహోన్నతమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. ముక్కంటి ఆలయం సుపథ మండపం వద్ద శ్రీకృష్ణదేవరాయలు జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శ్రీకాళహస్తి పరిధిలో ఏడాదికి మూడు పంటలు సాగవడం ఆయన దయతోనే అని కొనియాడారు. ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ...500 సంవత్సరాల తర్వాత కూడా ప్రజలు ఆయన్ను స్మరించుకోవడం గర్వకారణం అన్నారు.బీజేపీ నేత కోలా ఆనంద్ మాట్లాడుతూ... శ్రీకాళహస్తి రాజసానికి చిహ్నంగా ఉండే రాజగోపురం, ముక్కంటి ఆలయంలోని రాయలవారి మండపం చారిత్రక చిహ్నంగా నిలిచాయన్నారు.కాపు సంఘం నాయకులు కృష్ణమూర్తి, కృష్ణయ్య,సుబ్రహ్మణ్యం,కొట్టే సత్యం,మందల బాలాజీ పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గుల పోటీలు

ఏర్పేడు, జనవరి 17: శ్రీజ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలం రావిళ్లవారి కండ్రిగలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు ఆటలపోటీలు నిర్వహించారు. విజేతలకు చీరలు అందజేశారు.

పిచ్చికుక్క స్వైర విహారం


చికిత్స పొందుతున్న వెంకటేష్

శ్రీకాళహస్తి, జనవరి 17: ఓ పిచ్చికుక్క వృద్ధుడిని తీవ్రంగా గాయపరిచిన ఘటన సూళ్ళూరుపేట మండలంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. ఉగ్గుమూడి గ్రామంలో ఓ పిచ్చి కుక్క బుధవారం రెండు గేదెలను, ఓ పాపను కరిచి గాయపరిచింది. ఇదే క్రమంలో పొలం నుంచి ఇంటికి వెళుతున్న వెంకటేష్‌పై విరుచుకుపడింది. ఎడమ కాలి పిక్కను కండ ఊడేలా పీకేసింది. గాయపడిన వెంకటేష్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తికి తరలించారు. అతని కాలికి 15 కుట్లు పడినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

తేలుకాటుతో బాలికకు అస్వస్థత

శ్రీకాళహస్తి జనవరి 17: తేలుకాటుతో ప్రియాంక (8) అనే బాలిక తీవ్ర అస్వస్థతకు గురైంది. పెళ్ళకూరుకు చెందిన ప్రియాంక మూడో తరగతి చదువుతోంది. బుధవారం ఇంటి వద్ద ఆడుకుంటూ ఉండగా తేలు కాటు వేసింది. దీంతో అస్వస్థతకు గురైన చిన్నారిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కోడిపందేల కేసులో పదిమంది అరెస్టు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 17: మండలంలోని నెలవాయి, తిమ్మభూపాలపురం గ్రామాల సమీపంలో కోడిపందెం ఆడుతున్న పది మందిని పోలీసులు అరెస్టు చేసి నాలుగు కోళ్లు, రూ.3400 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అంజూరులో ముగ్గురి అరెస్టు

కేవీబీపురం,జనవరి17: మండలంలోని అంజూరు అటవీ ప్రాంతంలో బుధవారం కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని ఎస్ఐ సునీల్ అరెస్టు చేశారు.రెండు కోడిపుంజులు, రూ.950 నగదు స్వాధీనం చేసుకుని కోర్టుకు అప్పగించారు.ఏఎస్ఐ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ సంఘం సొమ్ము స్వాహా

వరదయ్యపాళెం, జనవరి 17: వరదయ్యపాళెం మండలం సీఎల్ఎన్‌పల్లి పంచాయతీలో వికలాంగ సంఘం సొమ్ము స్వాహా చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. లక్ష్మీపురంలో వెన్నెల అనే వికలాంగ సంఘం ఉంది. రామమూర్తి, ఎం.రవి మరో ఆరుగురు కలిసి సంఘంగా ఏర్పడి 2004నుంచి స్టేట్‌బ్యాంకులో రుణం తీసుకుంటూ కంతుల వారీగా క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. అయితే 2019లో బ్యాంకు అధికారులను కలిసి రూ.10లక్షలు రుణం అడగ్గా ఒప్పుకోలేదు.అయితే సంఘం పరిధిలోని సంఘమిత్ర శ్రీదేవి చేత రుణం తీసుకోవాలన్నా, కట్టాలన్నా ఖాళీ చెక్కులు, ఓచర్లమీద సంతకాలు పెట్టి ఇచ్చేవారు. 2022లో వికలాంగుల సంఘం తరపున రూ.8లక్షలు రుణం తీసుకున్నట్లు తెలిసి ఆశ్చర్యపోయారు. ఆ రుణంతో తమకు సంబంధం లేదని చెబుతున్నారు.అయితే బ్యాంకు అధికారులు తమపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తమ ఖాతాల్లో ఏదైనా సొమ్ము పడితే దానిని ఆ రుణంలో జమ చేసుకుంటున్నారని వాపోతున్నారు.

యానాదులకు దుస్తుల వితరణ

పిచ్చాటూరు, జనవరి 17: మండలంలోని చెంచురాజు కండ్రిగ యానాది కాలనీ వాసులకు సంక్రాంతిని పురస్కరించుకుని బుధవారం మధ్యాహ్న భోజన ఏర్పాట్లతో పాటు దుస్తులను వైసీపీ మండల అధ్యక్షుడు కె.వి.చలపతిరాజు వితరణ చేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సేవ

రేణిగుంట, జనవరి 17: రేణిగుంట మండలం ఆర్.మల్లవరం పంచాయతీ డీపీ కండ్రిగకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామానికి వచ్చారు.బెంగళూరు,చెన్నై నగరాల్లో పనిచేస్తున్న వారంతా దొరికిన ఖాళీ సమయంలో గ్రామ రహదారులకు ఇరువైపులా వున్న చెత్తను శుభ్రం చేశారు.

అన్నాసామిపల్లిలో ఘనంగా పశువుల పండుగ

రేణిగుంట, జనవరి 17: రేణిగుంట మండలం అన్నాసామిపల్లిలో బుధవారం సాయంత్రం పశువుల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరలో వున్న అల్లిమిట్టకు పశువులను తోలుకెళ్లి పొంగళ్ళు పెట్టి గ్రామ దేవతకు మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం చిట్లాకుప్ప వేసి ఉత్సాహంగా గడిపారు.

అరుణానది బ్రిడ్జికి మరమ్మతులు చేయిస్తా

టీడీపీ నేత జేడీ రాజశేఖర్


తుఫానుకు పూర్తిగా ధ్వంసమైన అరుణానది లో లెవెల్ కాజ్‌వే బ్రిడ్జి

పిచ్చాటూరు, జనవరి 17: ఇటీవలి తుఫానుతో ఓబుల్‌రాజు కండ్రిగ వద్ద అరుణానదిపై ఉన్న లో లెవెల్ కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోయింది.దీంతో పరిసరాల్లోని 10 గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనికి మరమ్మతులు చేపట్టి బ్రిడ్జిపై స్థానిక ప్రజల రవాణా రాకపోకలు పునరుద్ధరించడం కోసం జేడీఆర్ ఫౌండేషన్ ద్వారా పనులు చేపడతామని సత్యవేడు టీడీపీ నాయకుడు జేడీ రాజశేఖర్ హామీ ఇచ్చారు. బుధవారం సాయంత్రం అరుణానది బ్రిడ్జిని సందర్శించిన ఆయన స్థానిక ప్రజల విన్నపంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

చారిత్రాత్మక పార్వేటమండపాన్ని మళ్లీ నిర్మించాలి



తిరుమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో 800 ఏళ్ల చరిత్ర కలిగిన పార్వేటమండపం కాలగర్భంలో కలిసిపోయిందని, దాన్ని వెంటనే పునర్ నిర్మించాలని బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి కోరారు. బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. అలిపిరిలోని పాదాల మండపం పరిశీలన నిమిత్తం వచ్చిన కేంద్ర ఆర్కియాలజీ విభాగం బృందం తిరుమలలోని పార్వేటమండపాన్ని కూడా పరిశీలించి పునర్నిర్మాణం చేసే అంశంపై దృష్టి పెట్టాలని చెప్పిందన్నారు. పార్వేటమండపాన్ని పునర్నిర్మాణం చేసి మరో వెయ్యేళ్ల భక్తులకు దర్శనం చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి ప్రాణప్రతిష్ట 22వ తేదీన జరుగుతోందని, ఆ రోజున ప్రతి ఇంటి ముందు ఐదు జ్యోతులను వెలిగించాలని కోరారు. దేశవ్యాప్తంగా ఆలయాల నిర్మాణం జరుగుతుంటే ఏపీలో మాత్రం ఇప్పటివరకు కొన్ని వందల దేవాలయాలు ధ్వంసం చేశారని విమర్శించారు. వాటిని పునర్నిర్మాణం చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు.

ఇంటి పట్టాల పంపిణీలో కాలయాపన తగదు

వరదయ్యపాళెం, జనవరి 17: వరదయ్యపాళెంలో ప్రజలకు ఇంటి పట్టాల పంపిణీలో కాలయాపన తగదని బహుజనసమాజ్ వాదీ పార్టీ మండలాధ్యక్షుడు శంకర్ అన్నారు.ఇందిరానగర్, ముస్లింపాళెం ప్రజల బాధలు తీర్చాలని కోరారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలు

ఏర్పేడు, జనవరి 17: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో ఏర్పేడు మండలానికి చెందిన 40జట్లు క్రికెట్‌పోటీల్లో తలపడ్డాయి. బండారుపల్లి సచివాలయం, చెల్లూరు సచివాలయం మధ్య కుప్పయ్యకండ్రిగలో జరిగిన ఫైనల్ పోటీలో బండారుపల్లి జట్టు గెలుపొంది నియోజకవర్గస్థాయి పోటీలకు అర్హత సాధించింది. కొత్తవీరాపురంలో జరిగిన కబడ్డీ పోటీల్లో పంగూరు జట్టుపై కొత్తవీరాపురం జట్టు విజయం సాధించింది.

శివుడి సన్నిధిలో నాగేంద్రుడు

వరదయ్యపాళెం, జనవరి 17:వరదయ్యపాళెం మండలం పాండూరులోని జ్యోతీశ్వరాలయంలో బుధవారం ఓ నాగుపాము ప్రవేశించింది.ఆలయంలో కొలువైన జ్యోతీశ్వరుడి చుట్టూ తిరిగిన నాగుపాముకు భక్తులు హారతులు సమర్పించి పూజలు చేశారు.

రా..కదలిరా సభను జయప్రదం చేయండి


టీడీపీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

సత్యవేడు, జనవరి 17: టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో 19వ తేదీన వెంకటగిరిలో నిర్వహించనున్న రా..కదలిరా సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే హేమలత కోరారు. సత్యవేడులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హెలెన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, చెన్నైపోరం టీడీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్, మండల పరిశీలకులు ధనుంజయులు నాయుడు, దాము యాదవ్, గంజి మాధవయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ నాలుగున్నరేళ్ళ సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రజల్లో చైతన్యం కలిగించడానికే రా..కదలిరా సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

22న ఓటర్ల తుది జాబితా ప్రచురించాలి

పోలా భాస్కర్


అధికారులతో మాట్లాడుతున్న పోలా భాస్కర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 17: ఓటర్ల తుది జాబితాను ఈనెల 22న ప్రచురించాల్సి ఉంటుందని రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ ఆదేశించారు. మరుసటి రోజు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆ జాబితాను అందించాలని సూచించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఈఆర్వోలతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ వివరిస్తూ జిల్లాలో ముసాయిదా జాబితా గత అక్టోబరు 27న ప్రకటించామని, అన్ని రకాల ఫారమ్స్ 4,15,235 అందాయని, అందులో 0.17శాతం మాత్రమే పరిశీలనలో ఉన్నాయని, మిగిలినవి పూర్తి చేశామని తెలిపారు. 22న తుది జాబితా ప్రచురణకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. పోలా భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో అందిన ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కరించాలన్నారు. ఏఈఆర్వోలు, ఈఆర్వోలు పూర్తిస్థాయిలో మరోసారి పరిశీలించి ఓటర్ల జాబితా, సీరియల్ నంబర్లు వంటివి నిర్ధారణ చేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించి, రసీదు పొందాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పునకు సంబంధించి ఫైల్స్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమీక్షలో తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, డీఆర్వో పెంచలకిషోర్, ఆర్డీవోలు కిరణ్‌కుమార్, నిషాంత్ రెడ్డి, చంద్రముని, శివశంకర్‌రెడ్డి, ఏఈఆర్వోలు, సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేదవర్సిటీ రిజిస్ట్రార్‌గా రాధాగోవిందత్రిపాఠి బాధ్యతల స్వీకారం


వీసీ రాణీసదాశివమూర్తితో రిజిస్ట్రార్ రాధాగోవిందత్రిపాఠి

తిరుపతి(విద్య), జనవరి 17: టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ వేదవర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రాధాగోవిందత్రిపాఠి బుధవారం బాధ్యతలు చేపట్టారు. జాతీయ సంస్కృత వర్సిటీలో శిక్షాశాస్త్రి(ఎడ్యుకేషన్)విభాగ ప్రొఫెసర్‌గా పనిచేసే ఈయన్ను వర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం వీసీ సమక్షంలో బాధ్యతలను చేపట్టారు. కాగా ఆయన ఇదే వర్సిటీలో ప్రొఫెసర్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్, డిప్యూటీ వార్డెన్, పరీక్షల విభాగంలో ప్రత్యేకాధికారి వంటి వివిధ హోదాలలో పనిచేశారు.

ఎన్నికలకు ముందు డీఎస్సీ ప్రకటన మోసం కాదా?

● తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 16 : నెల రోజుల్లో ఎన్నికల షెడ్యూలు వస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటిస్తామనడం ఓట్ల కోసం కాదా అని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు ప్రశ్నించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి రాగానే మొదటి నెలలోనే మెగా డీఎస్సీని ప్రకటిస్తానని చెప్పి నిరుద్యోగులను నిలువునా ముంచేశారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తవుతున్నా ఒక్క డీఎస్సీని కూడా ప్రకటించలేదని అన్నారు. వేలకు వేలు ఖర్చు చేసి, డీఎస్సీ కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు సమాజంలో తలెత్తుకుని తిరగలేక ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. కొందరు గంజాయికి, డ్రగ్స్‌కు, మద్యానికి బానిసలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవన్నీ జగన్ ఇచ్చిన బూటకపు హామీల వలనే జరిగాయని ఆరోపించారు. ఇంత మోసపూరితమైన ముఖ్యమంత్రిని ఎక్కడా చూడలేదన్నారు. 9,771ప్రైమరీ పాఠశాలలను విలీనం చేసి, విద్యావ్యవస్థను సర్వనాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేశారని మండిపడ్డారు. ఎన్నికలు నెల రోజుల్లో ఉండగా మంత్రి బొత్స సత్యనారాయణ సంక్రాంతి తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని చెప్పడం ఎవరిని మోసం చేయడానికో చెప్పాలని నిలదీశారు. వైసీపీని గద్దె దించే వరకు యువత పోరాటం చేస్తుందన్నారు. డీఎస్సీ అభ్యర్థులు మంత్రిని కలవాలని ప్రయత్నం చేస్తే అరెస్టు చేసే పరిస్థితి నెలకొందన్నారు. సీఎం కోసం తాడేపల్లి ప్యాలెస్‌కు వెళితే పోలీసులు అడ్డుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వం మూడు డీఎస్సీలను పెట్టి, వేలాది మంది టీచర్లను నియమించిందని, అందుకే డీఎస్సీ అభ్యర్థులు మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అక్కింతల కృష్ణయాదవ్, తెలుగు యువత నాయకులు వాసు, కరణం సందీప్, రఫీ, శ్రీరామ్ బాబీ, దిలీప్‌రాయల్, గోపి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న రామాంజుల నాయుడు

కేవీబీపురం,జనవరి17: రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుని చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకుందామని టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజుల నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం కేవీబీపురంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోపీనాథరెడ్డి, సురేష్‌రెడ్డి, విజయనాయుడు, లక్ష్మీపతి రాజు, బాలాజీ, మణి, సాధూ, జనసేన ధామస్, పావని తదితరులు పాల్గొన్నారు.

గాలిపటం ఎగరవేస్తూ...

● మిద్దె మీద నుంచి జారిపడిన బాలుడికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న చరణ్

శ్రీకాళహస్తి, జనవరి 17: గాలిపటం ఎగురవేస్తూ మిద్దె మీద నుంచి జారి పడటంతో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాళహస్తి పట్టణంలోని భరద్వాజ గిరిజన కాలనీలో మంగళవారం సాయంత్రం చరణ్ స్నేహితుడితో కలిసి తన మిద్దె పైనుంచి గాలిపటాలు ఎగురవేశాడు. ఆదమరిచిన చరణ్ వెనక వైపు నడుచుకుంటూ భవనం నుంచి కిందకిపడిపోయాడు. గాయపడిన చరణ్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు పంపించారు.

కొండచిలువ కలకలం


పెట్రోల్ బంకులో ఉన్న కొండచిలువ

శ్రీకాళహస్తి, జనవరి 17:పెట్రోల్ బంక్‌లో కొండచిలువ కలకలం రేపింది.శ్రీకాళహస్తి పట్టణంలోని పొన్నాలమ్మ కూడలి వద్ద వున్న పెట్రోల్ బంకులో మంగళవారం రాత్రి కొండచిలువ కన్పించడంతో నిర్వాహకులు అటవీ శాఖ సిబ్బంది దాముకు సమాచారమిచ్చారు.ఆయన అక్కడికి చేరుకున్నారు. పామును చాకచక్యంగా పట్టుకుని రామాపురం అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

అదుపు తప్పి బోల్తా పడ్డ బస్సు

గాయాలతో బయటపడ్డ డ్రైవర్, కండక్టర్


గాజులమండ్యం వద్ద బోల్తా పడిన బస్సు

రేణిగుంట, జనవరి 17: రేణిగుంట- పుత్తూరు జాతీయ రహదారిలో బుధవారం తెల్లవారుజామున భారతీ బస్సు అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో డ్రైవర్‌కు, కండక్టర్‌కు గాయాలయ్యాయి.కంచి-తిరుపతి-శ్రీకాళహస్తి మధ్య నడుస్తున్న ఈ బస్సు గాజులమండ్యం పొలిమేరలోవున్న నూకాళమ్మ ఆలయంవద్ద డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్‌కు, కండక్టర్‌కు గాయాలయ్యాయి.పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని డివైడర్‌పై అడ్డంగా పడివున్న బస్సును క్రేన్ సహాయంతో పక్కకు తీశారు.అప్పటికే గాయపడినవారు ఆస్పత్రికి వెళ్ళారని పోలీసులు తెలిపారు. స్వల్పంగా గాయపడ్డ ప్రయాణికులు ఆటోల్లో వెళ్ళారని ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు. ఈ బస్సు నిండా ప్రయాణికులు ఉండివుంటే భారీగా ప్రాణ నష్టం జరిగి ఉండేదని తెలిపారు.